కథానిక:

అపశ్రుతి

శ్రీ పి. శ్రీనివాసరావు

రామ్మూర్తికి ఆ గది వొక చీకటికొట్టులాగా తోచింది. సిగరెట్ పొగ, సూక్ష్మమైన అత్తరు, యెండిపోయిన పూలవాసనలు, అలిసి చెమటలూరిన శరీరం వాసన—యివన్నీ కలిసున్నాయి. గది వాతావరణంలో.. తను వొక అంతులేని అగాధంముందు వేలాడుతున్నట్టు వూహించుకొంటున్నాడు మూర్తి.

గదిలో నిశ్శబ్దం— తన అడుగులచప్పుడు, శాంత యేడుపు మినహా—అతను భరించలేకపోతున్నాడు. వురుములు, భోరున వర్షంవచ్చి ఆ నిశ్శబ్దతను తరిమేస్తే బాగుణ్ణు.

వేడిశలవులను సిగరెట్‌పొగతో బాటు వూదేస్తూ తనచూపుల్ని శాంతమీదనుంచి మళ్లించాడు. కానీ. ....తన చెవుల్ని ఆవిడ రోదననుంచి మళ్ళించడానికి వీలులేకపోతున్నది... చీత్కారం—శాంత, కాస్తంత సేపు దాన్ని ఆపితే .. ....?

ఆఫీసు విషయాలు నెమరువేయడానికి ప్రయత్నించాడు మేనేజర్, పార్సిల్ ఆలస్యమవడంవల్ల కలిగే నష్టంగురించి అన్న మాటలు; ఆంగ్లో యిండియన్ టైపిస్టు సకాలానికి అర్జీలు వుత్తరాలను టైపుచేయడంలో కనబర్చిన నిర్లక్ష్యం;—యింతకు ఆ ఆంగ్లోయిండియన్ స్త్రీ యెవరో. యెక్కడిదో—

'మూర్తీ!'

శాంత తన యేడ్పుకు ఫుల్‌స్టాప్ పెట్టింది!!

నిజంగా చూస్తే కోపంగా వున్నప్పుడు శాంత అందంగా వుంటుంది. అంతేగాదు. ఆ పిలుపులో శాంత గొంతు శ్రావ్యంగా లేదూ? ఆ శ్రావ్యమైన కంఠాన్ని యేడ్చేదానికంటె మరో మంచివిధంగా వుపయోగించడానికి వీల్లేకపోయిందా?

"మూర్తీ!"

ఆమె వేపు తిరిగాడు.

"వూఁ! యేం?"

"అబ్బ! అంత కటువుగా అడగడం నేను భరించలేను!"

"ఐతే యింకేవిధంగా మాట్లాడమని నీవుద్దేశం?" విసురుగా అనేసి మళ్ళీ గదిలో పచారుసాగించాడు.... సన్నగా, నిటారుగా నడుస్తున్న అతను వొక ఎరబొమ్మ...

"గునుస్తూ కూచోడంకంటే అటోయిటో తెమల్చుకుంటే?" శాంత చిరాకుగా అంది ఆ మాటలు విని వినిపించుకొనకుండా ఆరిపోయిన సిగరెట్‌ను నేలకేసికొట్టి కుర్చీలో చేరగిలాడు మూర్తి. అతని చూపులు కొరకొరలాడ్తున్నయ్.

"మూర్తీ!"

తన పేరుని—అంటే శాంత వుచ్చరించే విధానం బట్టి—అసహ్యించుకొంటున్నానని మూర్తికి స్ఫురించింది. ఆ పేరుని పలికే శాంత పెదిమలకు ఆ పేరుతో ఆత్మీయత సహించరానిదిగా వున్నట్టు తోచింది అతనికి.

"యీ జగడాలంటే నాకు విసుగేస్తోంది." అంది శాంత చటుక్కున....

రామ్మూర్తి అవ్యక్త ఆత్మలో హేళన వాక్యాలు మెదిలాయి.

"నీ మొహం! అంతా పచ్చిఅబద్ధం! యీ రోజుల్లో నన్ను బాధించడానికి జగడం నీకు ఆత్మబంధువైంది."....కానీ అతని నోరుమాత్రం మెదల్లేదు

"నాకు విసుగేయదు మరీ? యీ తగాదాలకు కారణం పాతికవే! అప్పులు! అన్నీ అణాకానీ అప్పులు!" శాంత అందుకుంది మళ్ళీ.

"అణాకానీ అప్పులా? నా గెడ్డంకంటె వేగంగా పెరిగిపోతున్నయ్! అణాకానీ అప్పులుకావు. వేలు, లక్షలు అణాకాను లేమో శాంతా!"

"యెంతకాలమని వున్నదాంతో సర్దగలం? అవసరంకాని వస్తువు ఏవీ అని చెప్పలేంగదా! ప్రతిదీ చూస్తు దగానే అరిగిపోతూంటే! మాటకొస్తే ఆ శిధిలమైన కుర్చీకి యెన్ని రిపేరీలో! యేదో వొకటి వుండనే వుంది."

మూర్తి కుర్చీనిచూసి "అవును" అని నిట్టూర్చాడు.

ప్రతివస్తువు మన కళ్లెదుటే అరిగిపోతుంటుంది కొన్ని సంవత్సరాల్లోనే తమ దాంపత్యంకూడా, నిత్య సంపర్కంవల్ల, ఆ కుర్చీలాగే అరిగి, పురుగుముట్టిన స్థితి కొచ్చింది. దాంపత్యాన్ని కూడా కుర్చీలారిపేరి చేయొచ్చా? రామ్మూర్తి యీ వూహకు తనలోనే నవ్వుకున్నాడు. శాంత చూపులవాడికి ఆ నవ్వు దెబ్బతిని, తప్పుకున్నది....నిజంగా తమాషాకాదూ.... రిపేరి అయాక కొత్త వన్నెవచ్చిన దాంపత్యం అంటే?

పెళ్లి! అదిఅయి అప్పుడే ఐదేళ్లు గడిచాయి... అంటే భార్యా భర్తగా, అయిదేళ్లు గడిపారు! శాంతని యేవగింపుతో చూస్తుంటే, వీధిలో గబగబ వెళూవుంటే కారసిల్లే కొత్త స్త్రీ యెంత కోరదగనిదీ, పనికిరానిదో, శాంతకూడా అంతే అనిపించింది అతడికి.

శాంత మనస్తత్వం బాగా గ్రహించాడు. ఆవిడ బాహ్యాశాలు, నిలకడలేని ఆవేశాలు—అన్నీ అతను యెరిగినవే! పెళ్ళయిన కొత్తలో శాంతని వొక దేవతలాగా, ప్రేమత్యాగాలతో ఆరాధించాలనుకున్నాడు.

ఐదు సంవత్సరాల క్రిందటి మాట!

అతని భావాలు ఐదేళ్లు వెనక్కి నడిచాయి. తనప్పుడు గుంటూరు క్రిస్టియన్ కాలేజిలో బి. యే. చదువుతుండేవాడు. ఒకరోజు సాయంత్రం రింగ్ రోడ్డునుంచి తిరిగివస్తూ అరండల్‌పేట ఐదవలైనులో శాంతని చూశాడు. అప్పటి వాతావరణం కూడా తను మరిచిపోలేదు. ఆమె కళ్లు తనమీద సమ్మోహనాస్త్రాలయాయి. శాంతమీదనే నిలిచాయి తన చూపులు. .అంతే!

అతని కప్పుడు యిరవైవొకటో సంవత్సరం!

యిప్పుడు వేదనతో రామ్మూర్తి చూసే చూపులు తనని చీల్చే కత్తుల్లాగా తోచాయి శాంతకు.వెంటనే ఖచితంగా చెప్పింది. ."యిక లాభంలేదు! యీ విషయం పరిష్కారం చేయాలి"

వెంటనే రామ్మూర్తి యథాప్రపంచంలోనికొచ్చాడు. ఐదేళ్ళ కిందట శాంత తనకు ప్రేమ మూర్తి; యీనాడు తన విలాసాలకీ, సంఘంలో "గొప్ప"గా వుండడానికని చేసే దుబారాఖర్చుతో, చాపల్యంతో, తనని నాశనం చేస్తున్న ఆవిడనిచూచి "యెప్పటికీ వల్లగాదు!" అని తన అభిప్రాయం ప్రకటించాడు.

"విడాకుల కెట్లా వీలలేదు! అందుకు బదులు విడిపోవడం యిద్దరికీ మేలు!" తడుముకోకుండా చెప్పేసింది

"విడిపోవడమా? నీ కేమన్నా మతిపోలేదుగదా!" రామ్మూర్తి కంఠం కోపంతో వొణికింది.

"యిప్పటికి ఆ దశ పట్టకన్నా మన వ్యవహారం యిట్లాగే సాగితే ఆ దశకూడా పట్టొచ్చు. బాగా ఆలోచిస్తే విడిపోవడమే మంచిదనే నిర్ణయానికొస్తావ్! యీ వ్యవహారంతో మనిద్దరికీ తల వాచి దిగదా? నే నంటే నీకిష్టంలేదనే విషయం స్పష్టం-అలాటప్పుడు యిద్దరం స్వేఛ్ఛగావుండడం నయంగాదంటావా మూర్తీ! మనకి పిల్లా జల్లా లేరాయె! కనుక విడిపోవడంవల్ల యెవరికీ హాని జరగదు. యింకా యెన్నాళ్లిలా యీడుస్తాం యీ సంసారాన్ని?"

శాంత మాటలు మరలోంచి తయారయే పదార్థంలాగా యెంత నిర్జీవంగా వున్నాయి!

రామ్మూర్తికి వొళ్లు మండింది. సంతానంవల్ల తన ఆరోగ్యం, అందం, విలాసాలు, భగ్నమవుతాయని శాంత నిరోధించలేదూ? సంతానంమీద శాంత చూపిన అసహ్యం అతని జీవితంలో మానని గాయం!

"నా పీడ వదుల్తుంది నీకు... నవ్వన్నట్టు నేను నీ మెడకు గుదిబండలాగా వుండనుగా! ...కాదూ?" యీ మాటల్తో శాంత తన విషాన్నంతా వెళ్ళగక్కింది.

"నన్ను వదిలిపెట్టిపోవడానికి నీకు యెన్నడేనా ద్రోహం చేశానా?"

"నా కనుమానమే!" అంది అతన్ని రెచ్చగొట్టడానికి—ఐనా అతన్ని రెచ్చగొట్టడం అంత సులభంగాదు. రెచ్చగొట్టాక సమాధానపర్చడం అంతకన్నా సులభంగాదు.

"యెందుకు నీకీ దుర్బుద్ధి శాంతా?"

"యేమ్మన్నా అను-నిన్ను వొక త్యాగంగానీ, చెడుకార్యంగానీ చేయమని నే అడగడంలేదు!".... శాంతంగా మూర్తి మనసు మార్చాలని చూసిందావిడ.

"విడిపోతే నీ జీవితం యెలాగ సాగించగలవ్?"

శాంత వికటంగా నవ్వింది. "నీ ఆధారంతోనే—అంటే భరణం!"

"కలలో కూడా ఆశించకు! వూరికే కంఠశోష యెందుకుగానీ, నీ ప్రతిపాదనలు ఆపు శాంత!"

శాంత నవ్వు క్రోధంగా మారింది. ఆమె నోట్లోంచి కఠినమైన మాటలు పదునుగా, పొగలు గక్కుతూ, దూసుకుని వస్తున్నాయి. వినలేక చెవులు మూసుకున్నాడు. నోటిమీద వొక్క-దెబ్బతో యేకధారగా దొర్లే ఆ భూషణనయాగరాప్రవాహాన్ని ఆపాలనిపించింది రామ్మూర్తికి.

"... రోజులు, నెలలు, సంవత్సరాలు,—యీ విధంగా యెంతకాలమని యీ సంసారాన్ని యీడుస్తాము? నాకు సుఖంలేదు. ఒక్కరోజన్నా సుఖం లేదు. స్నేహితులతో కులాసాగా కొంచంసేపు గడుపుదామనుకుంటే వాళ్ళ వ్యవహారం నీకు భేషజంగా కనిపిస్తుంది! పోనీ నీవల్లనన్నా సుఖమా అంటే అదీ సున్న! బండి యీడ్చియీడ్చి అలిసిన గుర్రంలాగ వొగర్పుతో, విసుగా వస్తావు. తినేదేమిటోకూడా ఆలోచించవ్! పేపరు చదువుతూ నిద్రపోయి తలనొప్పితో లేసావు కర్మజాలక యేదన్నా నాతో మాట్లాడితే ఆఫీసు గొడవే! ఆఫీసు తగలబడ్డ రోజే నీకూ నాకూ శాంతి! యిన్నాళ్ళనుంచీ చాకిరీచేసినా, ప్రమోషన్‌గానీ జీతంలో హెచ్చింపుగానీ లేదాయె. పెళ్ళయిన కొత్తలో నాకెన్ని ఆశలు చూపావు! నేను వోపికపడితే చాలు అన్నీ సమకూరుస్తానని వూరించావు. వోపికపట్టాను! యేవిధంగా నువ్వు నన్ను సుఖపెట్టిందీ?"

శాంత మాట్లాడలేక చటుక్కున ఆగింది. చమటతో బట్టలు తడిసినై.

"ఐతే నువ్విప్పుడు కోరే దేమిటి?"

శాంత వొక్కసారిగా వుగ్రమూర్తియై చంగున లేచింది.

"నే కోరేదా? నువ్వు మాట యిచ్చిన ప్రకారం నాకే లోటూలేకుండా చేయమని! జీవితంలో ఆనందం బట్టలు, సొమ్ములు, చక్కటియిల్లు, నౌకర్లు, దూరదేశాలకి యాత్రలు, అన్నీ! నీ మాటమీద నిలబడలేకపోయావ్."

ఆఫీసు చాకిరీకి తన రక్తం వోడ్చి సంపాదిస్తుంటే, శాంత వొళ్లు తెలీకుండా కాస్తకూస్త దుబారాఖర్చు చేసిందా? తనమీదవున్న అసహ్యం మాత్రం—?

"నా మాట యెప్పుడూ తప్పలేదు నా శక్తికొద్దీ నీ కేలోటులేకుండా చేశాను."

శాంత మాటల్లో వుక్రోషం వుబ్బెతుగా లేచిపడుతున్నది. "మహాలోటులేకుండానే చేశావ్! ఆఫీసులో నీకంటె వెనకవచ్చినవాళ్లు గబగబ పైవుద్యోగాల్లోకొరబడ్తుంటే, తమరు మాత్రం వున్నచోటనే వున్నారు! మొన్నమొన్నకాదు శ్రీధరం వచ్చాడు! అప్పుడే పైకెళ్ళిపోలే?"

యీ ప్రశ్నకు సమాధానం చెప్పి ప్రయోజనం లేదు. తనెందుకు పైస్థానాల్లోకి వెళ్ళలే-పోయాడో వివరించలా యెన్నోసార్లు? "నువ్వు ఖర్చు తగ్గించు శాంతా! నా భారం కొద్దిగా నువ్వుకూడా భరించాలి. నే నొకవైపు సంపాదిస్తూంటే రెండోవైపు నువ్వు రెండింతలుగా ఖర్చు చేస్తుంటే మనం యేం దాచగలం? మద్రాసులో పెద్ద వుద్యోగం వస్తుంది పోదామంటే నీ స్నేహితురాళ్ళని వదిలిపెట్టలేక నా అవకాశాల్ని నాశనం చేశావు! అలాంటప్పుడు తప్పు నాదా?" యీ మాటలు రామ్మూర్తి యెన్నితడవలు అన్నాడో!..యిప్పుడు మళ్ళీ ఆ మాటల్నే వల్లించడాని కిష్టంలేక జవాబివ్వలేదు.

శాంత మాటల్లో వుద్ధృతం తగ్గినా, కోపావేశాన్ని సూచిస్తూ, బుగ్గలు యింకా కందివున్నాయి .. సంబాళించుకుని ఖచితంగా అన్నది. "యిక లాభంలేదు! నేను వెళ్ళిపోతాను." "వీల్లేదు." రామ్మూర్తి శాసనం!

చరచరచూసి గదిలో కెళ్లి దభాల్న తలుపు వేసింది.

బయట తుపాను చెలరేగేట్టుగా వున్నది. వురుములు వినిపిస్తున్నయ్. వర్షం నెమ్మదిగా యెక్కువవుతోందికూడా! కిటికీలోంచి చూస్తుంటే ఆకాశం మెరుపుల్తో ప్రజ్వరిల్లుతోంది.

శాంతకు తుఫానంటే తగనిభయం! ఆవిడను కలుసుకున్న కొత్తలో వురుము ఆవిడని రామ్మూర్తి కౌగిలిలోనికి తెచ్చింది. దాంతోనే ప్రణయం ప్రారంభం! అది జ్ఞప్తికొసునే ఆరోజున తన రక్తంలో తుఫాను, గుండెల్లో ప్రతిధ్వనించే వురుములు, భావిని చూపించే మెరుపులు—అన్నీ జ్ఞాపకం వొచ్చాయి.

భావి సుఖదుఃఖాలు.

కొంచంసేపయాక, నెమ్మదిగా అడుగులువేస్తూ, శాంత పడుకున్న గదిలో కెళ్లాడు దీపం తగ్గించబడివుంది. దుప్పటి అదుగున శాంత పడుకొనివున్నా, ఆవిడ నిద్రపోవడం లేదనిమాత్రం రామ్మూర్తికి తెలుసు.

దుప్పటి మాదిరిగానే శాంతనూ తను కొన్నాడా? యేమో! ఐదేళ్ళక్రితం శాంత తనని ప్రేమించకుండానే పెళ్లిచేసుకుందా? ఆ రోజుల్లో శాంత తనవారి ఆర్థికస్థితిని అసహ్యించుకొనేది తన వర్గానికి చెందనవాళ్ళనీ—ముఖ్యంగా యువకుల్నీ—చూస్తే పరిపడేదిగాదు. అంతకంటే వున్నత స్థితిలో కెళ్లాలనే శాంత ఆశయం!

తనని పెళ్ళి చేసుకుంది. ఆ పెళ్ళిమూలాన మళ్ళలోనే తన చదువుకి స్వస్తిచెప్పడం, తల్లిదండ్రుల మన్నన పోగొట్టుకోవడం జరిగాయి. అష్టకష్టాల కోర్చి తనని కాలేజికి పంపితే, రామ్మూర్తి వాళ్ళ మనసుల్ని గాయపరిచాడు. వాళ్ళ త్యాగాన్ని విర్లక్ష్యించాడు. అదీ పెళ్ళి ఖరీదు! .. పెళ్ళి ఖరీదు యిప్పటికీ చెల్లిస్తునే వున్నాడు!

బయట తుఫాను గట్టిగా గర్జించడంలేదు. గొణుగుతోంది. శాంత మంచంమీద కదలిక లేదు.

ఆవిడ తనని వదిలిపెటిపోతుందా?

పూర్వీకుల కంఠాలన్నీ అతన్ని హెచ్చరించినట్టయింది. వొక విషజంతువుని చూచినట్టు తన మానసికతత్వమే జుగుప్సతో ముడుచుకుపోయింది ఆ తలంపురానే! వొకసారి పెళ్ళయాక, మంచి రానీ, చెడురానీ విడిపోకూడదు; అదీ అతని సంప్రదాయం!

టట్! అతను నిద్రపోలేకపోతున్నాడు. వుదయమయేసరికి యీ ఆలోచనలతో అలిసిపోతాడు. మనసు, శరీరం, అన్నీ తీరనిబాధ అనుభవించగలవ్ యిలా జగడాలు, నిద్రలేని రాత్రులవల్ల, యింతకుముందు నలిగిపోలేదూ? సగం చచ్చినవాడిలా ఆఫీసు కెళ్తే, యథాప్రకారంగా ఆఫీసర్ తనమీద గుర్రు మనడం, తన తొందరచూచి ఆంగ్లోయిండియన్ టైపిస్టు అమ్మాయి లోలోపల తిట్టుకొనడం జరుగుతవి.

విడిపోవడమా! అసంభవం!

ఐనా యెందుకో శాంత తన సమీపంలోనేవున్నా, తమిద్దరిమధ్య అగాధం వున్నట్టు, తమ సాంగత్యంలో యేదో అవినీతి వున్నట్టు తోచింది రామ్మూర్తికి.

బయట తుఫాను విజృంభించింది. వురుముల గర్జనలు, యేకధారగా వర్షం, తళతళమంటు మెరుపులు—పడకగదిలో కూడా తుఫాను గొణుగుడు ఆగలేదు. వైమనస్యం యింకా తొలగలేదు. యిద్దరూ యెడంగా పడుకోనున్నారు.

అపరిచితులు ..వొకే పడకగదిలో ...రామ్మూర్తి శాంత—భార్య, భర్తలు....

వొకరి నొకరు యేవగించుకుంటూ..

———